RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

www.nityamnigha.com

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక


NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts





వరంగల్ | సంపుటి 2 | సంచిక 86 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | ఆదివారం | 27.09.2026 | పేజీలు : 8

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు.. - ప్రభుత్వం కీలక ప్రకటన

- కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు రంగం సిద్ధం
- నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం
- 2027 వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం
- అక్టోబర్ 5న సీడబ్ల్యూసీకి డిజైన్లు సమర్పించనున్న అధికారులు



2

బ్యాంక్ ఖాతాదారులకు అలర్ట్.. 3 రోజులు సమ్మె..

- సెప్టెంబర్ 28-30 వరకు మూడు రోజుల బ్యాంక్ సమ్మె
- సెప్టెంబర్ 27 ఆదివారం పనిచేయనున్న ప్రభుత్వ బ్యాంకులు
- ఆర్ఆర్‌బీలు సైతం ఆదివారం తెరిచే ఉంటాయి
- ముఖ్యమైన లావాదేవీలు ముందే పూర్తి చేసుకోవాలని బ్యాంకుల సూచన

2

ఈఎంఐ పద్ధతిలో లంచం..

రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ మహిళా సీడీపీవో

- జగిత్యాల జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీడీపీవో
- అంగన్వాడీ సూపర్‌వైజర్ల నుంచి నెలవారీ వసూళ్లు
- నెలకు ఒక్కొక్కరి నుంచి రూ.1000 చొప్పున ఒప్పందం
- మూడు నెలలకు కలిపి రూ.63,000 తీసుకుంటుండగా ఏసీబీ దాడి



2



తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఐలమ్మ నిలువెత్తు రూపం : కేసీఆర్

చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన కేసీఆర్

నాటి రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించిన వీరవనిత అని కేసీఆర్ కితాబు

ఐలమ్మ పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శనీయమని వ్యాఖ్య

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తూ... తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఆమె నిలువెత్తు రూపమని కొనియాడారు. నాటి రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించి, రైతాంగ హక్కుల కోసం పోరాడిన ధీర వనిత అని ప్రశంసించారు. అణచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని ఆమె ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు.

మిగతా 2వ పేజీ లో..

మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి

- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



- హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ
- పీవీ, మన్మోహన్ వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని వ్యాఖ్య
- మౌనాన్ని భాషగా మార్చి గొప్ప పాలన అందించారని ప్రశంస



నిత్యం నిఘా, హైదరాబాద్ : మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, విప్రో సర్కిల్ వద్ద మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మౌనాన్ని తన భాషగా మార్చుకుని, దేశానికి అద్భుతమైన పాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. అంతటి మహనీయుడికి భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవ తీసుకుని మన్మోహన్ సింగ్‌ను భారతరత్నతో సత్కరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన .....

2


రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

- హైకోర్టు తీర్పుపై రైతుబంధుపై ప్రభుత్వాన్ని తప్పుబట్టిన కేటీఆర్
- హామీలు అమలు కాలేదని ఆరోపణ
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి
- 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా
- సెప్టెంబర్ 28 నుంచి పట్టభద్రుల ఓటరు నమోదుకు పిలుపు



నిత్యం నిఘా, హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్న పోతును తెచ్చుకున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాక పోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

బాలాపూర్ రికార్డు బద్దలు.. బిల్‌సుఖ్‌నగర్ గణేశుడి లడ్డూకు రూ.51 లక్షలు!



దక్కించుకున్న స్థానిక భక్తుడు రాజేష్

ఇక్కడే మరో లడ్డూకు రూ.25 లక్షలు

వేలం నిర్వహించిన జై గణేశ్ యూత్ అసోసియేషన్

వేలం నిధులను సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తామన్న నిర్వాహకులు

2

నకిలీ ఆధార్‌లకు చెక్..

డూప్లికేట్ ఆధార్ల భరతం పట్టేందుకు దేశీయ టెక్నాలజీ

- నకిలీ ఆధార్ కార్డుల గుర్తింపునకు 'భారత్ ఏబీఐఎస్' అనే కొత్త వ్యవస్థ
- యూఐడీఏఐ పరిశోధకుల ఆధ్వర్యంలో దేశీయంగా అభివృద్ధి
- పరీక్షల్లో నిర్దేశిత లక్ష్యాలను మించి అత్యుత్తమ ఫలితాలు
- భారత పూర్తి డేటాబేస్‌పై ఇంకా విస్తృత పరీక్షలు జరగాల్సి ఉందన్న నిపుణులు



2

ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ

- ఈసీలో విభేదాల వార్తలను ఖండించిన పూర్తిస్థాయి కమిషన్
- నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని స్పష్టం చేసిన ముగ్గురు కమిషనర్లు
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి
- పనితీరును మెరుగుపర్చేందుకు అంతర్గత విధానాల్లో కీలక మార్పులు



2

గణేశ్ నిమజ్జనం సక్సెస్..

పోలీసులతో కలిసి డ్యాన్స్ చేసిన సీపీ సజ్జనార్



హైదరాబాద్‌లో ప్రశాంతంగా ముగిసిన గణేశ్ నిమజ్జనం

విజయవంతమైన బందోబస్తుతో పోలీసుల సంబరాలు

సిబ్బందితో కలిసి డ్యాన్స్ చేసిన హైదరాబాద్ సీపీ సజ్జనార్

ట్యాంక్‌బండ్, అసెంబ్లీ వైపు ట్రాఫిక్ ఆంక్షల ఎత్తివేత

2

మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి

- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి.. అభిప్రాయపడ్డారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల దార్శనికత వల్లే దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయని, దాని ఫలితంగానే నేడు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివి రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ చట్టాన్ని తీసుకువచ్చి, భూనిర్వాసితుల అంగీకారాన్ని తప్పనిసరి చేసిన ఘనత మన్మోహన్ సింగ్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. మన్మోహన్ సింగ్ జీవితం నేటి 'జెన్-జెడ్' సహా అన్ని తరాలకు స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఐలమ్మ నిలువెత్తు రూపం : కేసీఆర్

మొదటిపేజీ తరువాయి.. కేవలం భూస్వాములను వ్యతిరేకించడమే కాకుండా, అప్పట్లోనే చట్టాల పరిధిలో కోర్టుల ద్వారా న్యాయం పొంది ఆమె ప్రజాస్వామిక నిబద్ధతను చాటుకున్నారని కేసీఆర్ గుర్తుచేశారు. ఐలమ్మ పోరాట పటిమ నేటి యువతకు ఎప్పుడూ ఆదర్శనీయమని, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆమె స్ఫూర్తి చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. తాను చేపట్టిన శాంతియుత మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆమే పోరాట స్ఫూర్తి అంతర్భాగంగా ఉందన్నారు. చాకలి ఐలమ్మ చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టామని కేసీఆర్ వెల్లడించారు. ఐలమ్మ ఆశయాల సాధనే ధ్యేయంగా తాము అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో మహిళా, శిశు సంక్షేమంతో పాటు రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతికి ఎన్నో విప్లవాత్మక పథకాలను అమలు చేశామని తెలిపారు. కులవృత్తులకు పునరుజ్జీవం పోసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా తెలంగాణ ఆత్మగౌరవాన్ని మహోన్నతంగా నిలబెట్టామని, ఆనాడు తాము సాధించిన ప్రగతి నేడు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

ఈఎంఐ పద్ధతిలో లంచం..

రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ మహిళా సీడీపీవో

మొదటిపేజీ తరువాయి.. లంచాన్ని నెలవారీ వాయిదాల రూపంలో వసూలు చేస్తున్న ఓ ప్రభుత్వ అధికారిణి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ ఘటన తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో చోటుచేసుకుంది. మెట్‌పల్లి చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీవో)గా పనిచేస్తున్న దారోజు పద్మ, తన పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తుంటారు. అయితే, ఈ తనిఖీల్లో ప్రతికూల నివేదికలు ఇవ్వకుండా ఉండేందుకు గాను, ఆమె పరిధిలోని 21 మంది అంగన్వాడీ సూపర్‌వైజర్ల నుంచి నెలవారీ మామూళ్లు డిమాండ్ చేశారు. దీని ప్రకారం, ఒక్కో సూపర్‌వైజర్ నెలకు రూ. 1000 చొప్పున ఆమెకు లంచంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో, మూడు నెలలకు సంబంధించిన మొత్తాన్ని ఆమె ఏకమొత్తంగా వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. 21 మంది నుంచి రూ.63,000 లంచం తీసుకుంటుండగా, పక్కా సమాచారంతో ఏసీబీ అధికారులు వలపన్ని ఆమెను పట్టుకున్నారు. లంచం తీసుకుంటున్న సమయంలో పద్మను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఒక ప్రభుత్వ అధికారిణి ఇలా నెలవారీ పద్ధతిలో లంచం వసూలు చేయడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు..

ప్రభుత్వం కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి.. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు నవంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. 2027 వర్షాకాలం నాటికి ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. బ్యారేజీల భద్రత, నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సహా నిపుణుల కమిటీలు లేవనెత్తిన అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల మేరకే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేసి, వాటి పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన ఈ సమావేశంలో నొక్కిచెప్పారు.

బ్యాంక్ ఖాతాదారులకు అలర్ట్.. 3 రోజులు సమ్మె..

మొదటిపేజీ తరువాయి..
దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో ఈ సమ్మె జరగనుంది. దీంతో పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో (ఆర్ఆర్‌బీలు) బ్రాంచ్ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. సమ్మెకు ముందు వారాంతపు సెలవులు ఉండటంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకు శాఖల సేవలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఖాతాదారులు ముఖ్యమైన నగదు లావాదేవీలు, చెక్కులు, ఇతర బ్రాంచ్ పనులను ముందుగానే పూర్తి చేసుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి. ఖాతాదారులకు ఇబ్బందులు తగ్గించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 27న ఆదివారం అయినప్పటికీ ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సాధారణంగా పనిచేయనున్నాయి. అన్ని బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఏటీఎం-లింక్ శాఖలు పనిచేసేందుకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది. సమ్మె సమయంలో బ్రాంచ్ సేవలకు అంతరాయం వచ్చినా డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవచ్చు. ఎస్‌బీఐ సహా పలు బ్యాంకులు ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఏటీఎంలు, క్యాష్ డిపాజిట్ మెషీన్లను ఉపయోగించుకోవాలని ఖాతాదారులను కోరాయి. వారానికి ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయడంతో పాటు ఉద్యోగులకు సంబంధించిన ఇతర అంశాలపై యూనియన్లు డిమాండ్లు చేస్తున్నాయి. ప్రభుత్వం సమ్మెను విరమించాలని కోరుతూ చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేసింది. అయితే సెప్టెంబర్ 28-30 సమ్మెకు యూనియన్లు ముందుకు సాగుతున్నట్లు తాజా సమాచారం.

ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

- ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ

మొదటిపేజీ తరువాయి..
భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలను కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలకు తెరదించుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న గ్రూప్ ఫోటోతో పాటు ఒక సుదీర్ఘమైన ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR), ఓటర్ల నమోదు ప్రక్రియ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలపై ఇందులో సమగ్రంగా వివరణ ఇచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని సెప్టెంబర్ 23న ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ప్రత్యేక సవరణ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో, దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పేర్ల ద్వారా గత సవరణతో తమ సంబంధాన్ని ధ్రువీకరించాలనే నిబంధనపై వస్తున్న విమర్శలపైనా కమిషన్ స్పందించింది. ఈ డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది. అయితే, ఈ నిబంధన కేవలం ప్రత్యేక సవరణ ప్రక్రియకు మాత్రమే వర్తిస్తుందని, మిగతా సమయాల్లో ఎలక్టర్ల నమోదు నిబంధనలు, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారాలనే వాడతామని స్పష్టం చేసింది. గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన ఫారాలను సేకరించాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సంబంధిత బూత్ లెవల్ అధికారులను ఆదేశించారని పేర్కొంది. ఇప్పటికే ఆ 97 మంది లో 81 మంది తమ పేర్లను చేర్చాలని కోరుతూ ఫారం-6 సమర్పించారని వెల్లడించింది. ఇక, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు యాక్సెస్ విషయంలో ECINET పోర్టల్‌పై తలెత్తిన ఆందోళనలపైనా కమిషన్ స్పందించింది. క్షేత్రస్థాయి అధికారులకు వారి చట్టబద్ధమైన అధికారాలకు అనుగుణంగానే 'రోల్-బేస్డ్ యాక్సెస్' ఇస్తామని స్పష్టం చేసింది. ఈ పోర్టల్ పనితీరును సమీక్షించేందుకు ఓ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో ఐఐటీ లేదా ట్రిపుల్ ఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడు కూడా ఉంటారని ప్రకటించింది. క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ ఈసీ విధానపరమైన అంశాలకు సంబంధించింది కాదని, డిప్యూటేషన్‌పై ఉన్న ఓ అధికారి పని పునఃపంపిణీకి మాత్రమే సంబంధించిందని కమిషన్ స్పష్టం చేసింది. అంతర్గత పనివిధానాలను మరింత బలోపేతం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇకపై కమిషన్ సమావేశాల అజెండాలను సభ్యులకు ముందుగానే సర్క్యులేట్ చేయాలని, సమావేశం అనంతరం మినిట్స్ జారీ చేయాలని నిర్ణయించింది.

నకిలీ ఆధార్‌లకు చెక్.. డూప్లికేట్ ఆధార్ల భరతం పట్టేందుకు దేశీయ టెక్నాలజీ

మొదటిపేజీ తరువాయి.. దేశంలో ఆధార్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా భారత పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. నకిలీ ఆధార్ కార్డులను అత్యంత కచ్చితత్వంతో గుర్తించేందుకు 'భారత్ ఏబీఐఎస్' (Bharat ABIS) అనే సరికొత్త ఓపెన్ సోర్స్ బయోమెట్రిక్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. యూఐడీఏఐతో సంబంధం ఉన్న పరిశోధకులు, ఐఐఐటీ హైదరాబాద్, మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ నిపుణుల బృందం సంయుక్తంగా ఈ టెక్నాలజీని రూపొందించింది. ఇది దేశవ్యాప్తంగా ఆధార్ డేటాబేస్‌లో డూప్లికేట్ ఎంట్రీలను ఏరివేయడంలో కీలకంగా మారనుంది. 'భారత్ ఏబీఐఎస్' అనేది వేలిముద్రలు, కనుపాప (ఐరిస్), ముఖ కవళికలను కలిపి బయోమెట్రిక్స్‌ను విశ్లేషించే ఒక మల్టీ-మోడల్ వ్యవస్థ. ఈ మూడు డేటాలను కలిపి ప్రతి వ్యక్తికి కేవలం 13.5 KB పరిమాణంలో ఒక టెంప్లేట్‌ను ఇది సృష్టిస్తుంది. దేశంలోని మొత్తం 155 కోట్ల ఆధార్ ఎంట్రీల నుంచి నమూనాగా సేకరించిన 22 కోట్ల డీ-ఐడెంటిఫైడ్ రికార్డులపై ఈ వ్యవస్థను పరీక్షించారు. ముఖ్యంగా 2 కోట్ల రికార్డుల సబ్‌సెట్‌పై జరిపిన పరీక్షల్లో ఇది అద్భుతమైన ఫలితాలను కనబరిచింది. తప్పుడు గుర్తింపుల రేటు (ఎఫ్‌పీఐఆర్) కేవలం 0.1 శాతంగా, అసలైన వాటిని గుర్తించడంలో వైఫల్యం రేటు (ఎఫ్ఎన్ఐఆర్) 0.05 శాతంగా నమోదైంది. ఈ ఫలితాలు యూఐడీఏఐ నిర్దేశించిన 0.5% ఎఫ్‌పీఐఆర్, 0.1% ఎఫ్ఎన్ఐఆర్ లక్ష్యాల కన్నా చాలా మెరుగ్గా ఉండటం గమనార్హం. ఎఫ్‌పీఐఆర్, ఈ వ్యవస్థ రూపకల్పనలో ఓపెన్ సోర్స్ భాగాలను వినియోగించడం వల్ల ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. డేటా ప్రాసెసింగ్, నాణ్యత అంచనా, ఫేక్ బయోమెట్రిక్స్‌ను గుర్తించడం వంటి పనుల కోసం ఓపెన్ సోర్స్ టూల్స్‌నే వాడారు. భారీ డేటాబేస్‌లో శోధన ప్రక్రియ వేగంగా జరిగేందుకు సర్వర్లపై పనిభారాన్ని సమానంగా పంపిణీ చేసే ఒక ప్రత్యేక షెడ్యూలర్‌ను కూడా ఇందులో పొందుపరిచారు. వాణిజ్యపరంగా అందుబాటులో ఉన్న మూడు ప్రముఖ వ్యవస్థలతో పోల్చినప్పుడు 'భారత్ ఏబీఐఎస్' వాటికి సమానమైన లేదా అంతకంటే మెరుగైన కచ్చితత్వాన్ని చూపించింది. 8 ఎన్విడియా H100 జీపీయూలు, 2 టీబీ ర్యామ్‌తో కూడిన ఒక్క సర్వర్‌పై 4 కోట్ల రికార్డుల గ్యాలరీలో సెకనుకు 100 శోధనలు చేయగల సామర్థ్యం దీనికి ఉంది. దేశంలో డూప్లికేట్ ఆధార్ కార్డులు ఇప్పటికీ ఒక సవాలుగానే ఉన్నాయి. 2022లో ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ దాదాపు 6 లక్షల నకిలీ ఆధార్ కార్డులను గుర్తించి రద్దు చేసినట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో 'భారత్ ఏబీఐఎస్' ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోని 'డీప్‌ప్రింట్' ఫింగర్‌ప్రింట్ మోడల్.. వృద్ధులు, చేతివేలిముద్రలు అరిగిపోయిన శ్రామికుల బయోమెట్రిక్ ప్రామాణీకరణ వైఫల్యాలను సగానికి తగ్గించగలదని పరిశోధకులు తెలిపారు. అయితే, ఈ వ్యవస్థ అద్భుతమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ, దేశంలోని పూర్తి ఆధార్ డేటాబేస్‌పై దీనిని ప్రయోగించడానికి ముందు మరిన్ని విస్తృత స్థాయి పరీక్షలు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో 2 కోట్ల లోపు జనాభా ఉన్న దేశాలకు ఇది తక్కువ ఖర్చుతో కూడిన సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా ఉపయోగపడగలదని వారు పేర్కొన్నారు.

బాలాపూర్ రికార్డు బద్దలు

దిల్‌సుఖ్‌నగర్ గణేశుడి లడ్డూకు రూ.51 లక్షలు..!

మొదటిపేజీ తరువాయి.. భాగ్యనగరంలో గణేశ్ నిమజ్జనోత్సవాల వేళ లడ్డూ వేలం పాటలు ఆసక్తికరంగా మారాయి. ఈ ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం రికార్డును దిల్‌సుఖ్‌నగర్ లడ్డూ అధిగమించింది. అక్కడ నిర్వహించిన వేలంలో గణేశుడి ప్రధాన లడ్డూ ఏకంగా రూ.51 లక్షలకు అమ్ముడైంది. దిల్‌సుఖ్‌నగర్‌లోని జై గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 2.5 కోట్ల మిర్రర్ గ్లాస్‌లతో ప్రత్యేకంగా అలంకరించిన గణేశుడి మండపంలో శనివారం లడ్డూ వేలం నిర్వహించారు. భక్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొన్నారు. చివరకు స్థానిక భక్తుడు రాజేష్ రూ.51 లక్షలు వెచ్చించి ప్రధాన లడ్డూను సొంతం చేసుకున్నారు. దీంతో ఈ ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలంలో నమోదైన రూ.39 లక్షల ధరను దిల్‌సుఖ్‌నగర్ లడ్డూ దాటింది. ఇదే మండపంలో మరో లడ్డూకు కూడా భారీ ధర పలికింది. మరో భక్తుడు రూ.25 లక్షలకు దక్కించుకున్నారు. గణేశుడి లడ్డూ ప్రసాదాన్ని ఇంటికి తీసుకెళితే శుభం కలుగుతుందని, వ్యాపారంలో అభివృద్ధి ఉంటుందని భక్తుల్లో విశ్వాసం ఉంది. ఈ నమ్మకంతోనే వేలంలో భక్తులు పెద్ద మొత్తంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గణేశ్ నిమజ్జనం సక్సెస్..

పోలీసులతో కలిసి డ్యాన్స్ చేసిన సీపీ సజ్జనార్

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును విజయవంతంగా నిర్వహించడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తన సిబ్బందితో కలిసి సంబరాలు జరుపుకున్నారు. నిమజ్జన ప్రక్రియ ముగిసిన అనంతరం, తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ కింద పోలీసు సిబ్బందితో కలిసి సీపీ సజ్జనార్ నృత్యం చేశారు. 'ది ప్యారడైజ్' చిత్రంలోని 'ఆయా షేర్' పాటకు ఆయన చిందులేశారు. గత కొన్ని రోజులుగా విధుల్లో నిమగ్నమై అప్రమత్తంగా ఉన్న పోలీసులు, నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి కావడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉన్నతాధికారి స్వయంగా వారితో కలవడంతో సిబ్బందిలో ఉత్సాహం రెట్టింపైంది. మరోవైపు, నగరంలో నిమజ్జన క్రతువు ముగియడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేశారు. సచివాలయం పరిసర ప్రాంతాలైన ట్యాంక్‌బండ్, లిబర్టీ, అసెంబ్లీ మార్గాల్లో వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సాధారణ స్థితికి చేరుకుంది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



వరంగల్, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): రంగశాయిపేట 42వ డివిజన్ గవిచర్ల క్రాస్ రోడ్డు వద్ద రజక సంఘం నాయకులు ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి బక్కి రంజిత్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాలు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు.దొరల పాలనను ధిక్కరిస్తూ వెట్టిచాకిరి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాడారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం నిర్భయంగా పోరాడిన ఆమె.. భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం సాగిన ఉద్యమంలో చెరగని ముద్ర వేశారని తెలిపారు. సామాజిక వివక్ష, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం ఒక వ్యక్తికి పరిమితమైనది కాదని, అణగారిన ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రజా ఉద్యమ చరిత్రలో ఆమె పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని గుర్తుచేశారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నల్లతీగల రాజయ్య, కత్తెరపెళ్లి వేణు, ముసుకుంట్ల యాకయ్య, పొన్నం వెంకటేష్, ముసుకుంట్ల రాజు, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

న్యూ శాయంపేటలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

- విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- నైజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



హన్మకొండ, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ వీరనారి, సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను హన్మకొండ జిల్లా న్యూ శాయంపేటలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాయంపేట లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, రజక సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేతిరి నాగరాజు పాల్గొని ఐలమ్మకు అంజలి ఘటించారు. హన్మకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, సత్య శారదలు సైతం కార్యక్రమానికి హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నైజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన వీరోచిత పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రజక సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐలమ్మకు నివాళులర్పించారు.

పల్లె ప్రకృతి వనాలు.. క్రీడా ప్రాంగణాలపై అధికారుల నిర్లక్ష్యం?





ములుగు జిల్లా/ మల్లంపల్లి, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించాలని బీఆర్ఎస్ నేత మెర్గు రాజు డిమాండ్ చేశారు. మల్లంపల్లి మండలంలోని పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాల ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర విచారణ నిర్వహించాలని కోరారు. పచ్చదనం పెంపు, గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించడం, యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు మెర్గు రాజు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం వాటి నిర్వహణపై తగిన శ్రద్ధ కనిపించడం లేదని ఆరోపించారు. మండలంలోని కొన్ని పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలకు సరైన నీటి సదుపాయం లేక ఎండిపోతున్నాయని, నిర్వహణ లోపంతో వనాలు కళావిహీనంగా మారుతున్నాయని అన్నారు. కేవలం మొక్కలు నాటడంతో బాధ్యత పూర్తికాదని, వాటి సంరక్షణ, నీటి సదుపాయం, పారిశుధ్యం, రక్షణకు నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. ప్రజలు కుటుంబాలతో ఆహ్లాదంగా గడపాల్సిన పల్లె ప్రకృతి వనాలు, యువత క్రీడలు ఆడాల్సిన క్రీడా ప్రాంగణాలు కొన్ని ప్రాంతాల్లో తాగుబోతులకు అడ్డాలుగా మారుతున్నాయనే ఆరోపణలు వస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన ప్రజా వసతులు అసాంఘిక కార్యకలాపాలకు వేదికలుగా మారకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణ నేపథ్యంలో పచ్చదనం పెంపు కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉందని మెర్గు రాజు అన్నారు. ములుగు జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షపాత లోటు నమోదవుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ చర్యలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.“పచ్చదనం గురించి సభల్లో మాట్లాడటం కాదు.. క్షేత్ర స్థాయిలో పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాల పరిస్థితిని అధికారులు పరిశీలించాలి. ఫొటోలకు, ప్రచారానికి కార్యక్రమాలు పరిమితం కాకుండా ఏర్పాటు చేసిన వసతులను కాపాడే బాధ్యత కూడా ప్రభుత్వానిదే” అని మెర్గు రాజు అన్నారు. మల్లంపల్లి మండలంలోని అన్ని పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమగ్ర నివేదిక రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. మొక్కలకు నీరు, వనాలకు రక్షణ, క్రీడా ప్రాంగణాలకు అవసరమైన నిర్వహణ కల్పించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

కేయూలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

- వీరనారి పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంకేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం



హన్మకొండ, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శనీయమని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ నాటి తెలంగాణ రైతాంగ పోరాటంలో ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు చారిత్రాత్మకమని అన్నారు. దొరల దౌర్జన్యాలు, భూస్వామ్య అరాచకాలు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, అణచివేతకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ధైర్యంగా తమ స్వరాన్ని వినిపించాలని, ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ బోడిగె సతీష్‌తో పాటు పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విశ్వవిద్యాలయ సిబ్బంది పాల్గొని చాకలి ఐలమ్మ సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు.

మహేందర్, రమేష్‌ల విద్యాసేవలకు జిల్లా స్థాయి గౌరవం





వరంగల్ / పర్వతగిరి, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్యా రంగంలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విశేష కృషి చేస్తున్న పల్లవి హైస్కూల్, అన్నారం కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్‌లకు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు లభించింది. 2026 సంవత్సరానికి గాను వీరిని ‘ఉత్తమ ఉపాధ్యాయులు’గా ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. వరంగల్ రంగశాయిపేటలోని బిర్లా ఓపెన్ మైండ్స్‌లో వాడుప్సా, టీఆర్ఎస్ఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల కార్యక్రమంలో గంజి మహేందర్, కోటగిరి రమేష్‌లను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. మహేందర్ 30 సంవత్సరాలు, రమేష్ 25 సంవత్సరాలుగా అందిస్తున్న విద్యాసేవలను నిర్వాహకులు ప్రత్యేకంగా కొనియాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందిస్తూ విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పల్లవి హైస్కూల్ చైర్మన్ రాచకొండ అశోకచారి మాట్లాడుతూ మహేందర్, రమేష్‌లు నిబద్ధత, అంకితభావంతో విద్యారంగంలో సేవలందిస్తున్నారని అన్నారు. వారికి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు లభించడం పల్లవి హైస్కూల్‌తో పాటు అన్నారం ప్రాంతానికే గర్వకారణమని పేర్కొన్నారు. ఇద్దరికీ అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, రాష్ట్ర ప్రధాన సలహాదారు యాదగిరి శేఖర్‌రావు, రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నైసా ఉపాధ్యక్షుడు డాక్టర్ జె.ఎస్. పరంజ్యోతి, వరంగల్ డీఈఓ బి. రంగయ్యనాయుడు, ఎంఈఓలు కె. వెంకటయ్య, ఎస్. వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు. అవార్డు గ్రహీతలు గంజి మహేందర్, కోటగిరి రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి కేవలం పాఠాలు బోధించడానికే పరిమితం కాదని, భావితరాలను విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. తమ సేవలను గుర్తించి సత్కరించిన వాడుప్సా, టీఆర్ఎస్ఎంఏ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. మహేందర్ మూడు దశాబ్దాల విద్యాసేవలకు, రమేష్ పాతికేళ్ల విద్యాప్రస్థానానికి జిల్లాస్థాయి గౌరవం దక్కడంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఆదివాసీల హక్కుల కోసం అక్టోబర్ 14న హైదరాబాద్‌లో మహాధర్నా



ఏటూరునాగారం, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): ఆదివాసీల రాజ్యాంగ హక్కులు, భూమి హక్కులు, ఉద్యోగాలు, విద్య, ఉపాధి, పోడు భూములకు హక్కు పత్రాలు, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి తదితర సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 14న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ‘చలో హైదరాబాద్–ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నా’ను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల జేఏసీ, తుడుందెబ్బ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏటూరునాగారం ఐటీడీఏ కేంద్రంలోని కొమురం భీమ్ విగ్రహం వద్ద మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం స్పష్టమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన భూముల రక్షణకు 1/70 చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పోడు సాగుదారుల సమస్యలను పరిష్కరించి అర్హులైన ప్రతి కుటుంబానికి హక్కు పత్రాలు అందించాలని కోరారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే అంశంపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని, జీవో నంబర్–3 స్థానంలో కొత్త ఉత్తర్వులు తీసుకురావడానికి గిరిజన సలహా మండలి చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. 1/70 చట్టానికి సంబంధించి గిరిజనేతరులు దాఖలు చేసిన కేసులో ప్రభుత్వం సుప్రీంకోర్టులో కౌంటర్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే శాఖలకు సంబంధించిన ఉత్తర్వులను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. పోడు సాగు చేస్తున్న అర్హులైన రైతులకు హక్కు పత్రాలు అందించడంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని నాయకులు కోరారు. ఆదివాసీల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఆదివాసీ సంఘాలతో చర్చలు జరిపి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అక్టోబర్ 14న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు ఆదివాసీ ప్రజలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కుల సాధన కోసం శాంతియుతంగా, ఐక్యంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య, జాతీయ కో–కన్వీనర్ పోదెం కృష్ణ ప్రసాద్, ఆల్ ఇండియా ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోట రవి, నాయకపోడు హక్కుల పోరాట సమితి జాతీయ నాయకుడు బొల్లెం సారయ్య, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శులు చింత కృష్ణ, వట్టం జనార్దన్, మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత, తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి వట్టం సురేష్, జెజ్జరి శ్రీధర్, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు తాటి నీలాద్రి, ఉపాధ్యక్షుడు కోరం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

స్మశానవాటికకు దారి లేదు.. మృతదేహాల తరలింపునకు అవస్థలు



ఏటూరునాగారం, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి గ్రామంలో స్మశానవాటికకు వెళ్లేందుకు సరైన రహదారి లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో దారి పూర్తిగా బురదమయంగా మారడంతో మృతదేహాలను స్మశానవాటికకు తరలించడం కష్టసాధ్యంగా మారుతోంది. స్మశానవాటికకు కనీస రహదారి సౌకర్యం లేకపోవడంతో అంతిమయాత్ర సమయంలో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధిపై హామీలు ఇస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు స్మశానవాటిక రహదారి సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కనీసం అంతిమ సంస్కారాలకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొనడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి స్మశానవాటికకు శాశ్వత రహదారి నిర్మించాలని ఎలిశెట్టిపల్లి గ్రామస్థులు డిమాండ్ చేశారు.

దొరల దోపిడీకి ఎదురొడ్డి పోరాడిన వీరనారి ఐలమ్మ



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): దొరలు, భూస్వాముల దోపిడీకి ఎదురు నిలిచి భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని మంథని బీజేపీ నాయకులు అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మంథని పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.మంథని పట్టణ బీజేపీ అధ్యక్షుడు సబ్బని సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు బూడిద తిరుపతి మాట్లాడుతూ నైజాం పాలన, రజాకార్లు, భూస్వాములు, పటేల్, పట్వారీ, దేశ్‌ముఖ్‌ల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించిందన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం ప్రజలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఐలమ్మ ధైర్యంగా నిలబడి పోరాటానికి నాంది పలికారని గుర్తుచేశారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన తెగువ, పట్టుదల నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు బోగోజు శ్రీనివాస్, అసెంబ్లీ కో–కన్వీనర్ నాంపల్లి రమేష్, పట్టణ మాజీ అధ్యక్షులు చిలువేర సతీష్, సీనియర్ నాయకుడు నారమల్ల కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు సామల అశోక్, ఎడ్ల సాగర్, పట్టణ కార్యదర్శులు పార్వతి విష్ణు, మాచిడి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి : దొంతి మాధవరెడ్డి



వరంగల్, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ నాయకులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు ప్రకటించడంతో పాటు ఉద్యోగుల ఇతర సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రిని కలిసి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరేలా కృషి చేయాలని కోరారు.వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షుడు గాజే వేణుగోపాల్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ అన్ని రంగాల్లో కష్టపడి పనిచేసి రాష్ట్రంలోనే వరంగల్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం, గౌరవ అధ్యక్షుడు గజ్జల రామ్‌కిషన్, నర్సంపేట యూనిట్ అధ్యక్షుడు కృష్ణమోహన్, కార్యదర్శి మహేందర్, జిల్లా బాధ్యులు చిరంజీవి, ఇతర సంఘ నాయకులు పాల్గొన్నారు.

సామాజిక సేవతో సాయివర్ధన్ పుట్టినరోజు వేడుకలు

- సేవా దృక్పథంతో వేడుకలు నిర్వహించడం ఆదర్శనీయం : మంథని సీఐ బుద్దే స్వామి

పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా): పుట్టినరోజు వేడుకలను ఆర్భాటాలకు పరిమితం చేయకుండా నిరుపేదలకు అండగా నిలిచేలా నిర్వహించడం అభినందనీయమని మంథని సీఐ బుద్దే స్వామి అన్నారు. మంథని మండలం ఎక్లాస్పూర్ గ్రామానికి చెందిన తాటి విజయ్‌కుమార్ స్వామి–నిహారిక దంపతులు తమ కుమారుడు తాటి సాయివర్ధన్ (టిల్లు) పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయివర్ధన్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఎక్లాస్పూర్ గ్రామానికి చెందిన ఐదు నిరుపేద కుటుంబాలకు తొమ్మిది రకాల నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో పంపిణీ చేశారు. సీఐ బుద్దే స్వామి, ఎస్ఐ సందీప్‌కుమార్ లబ్ధిదారులకు స్వయంగా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ బుద్దే స్వామి, ఎస్ఐ సందీప్‌కుమార్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న నిరుపేదలను ఆదుకోవడం గొప్ప విషయమన్నారు. ప్రత్యేక సందర్భాలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా సమాజానికి మంచి సందేశం అందుతుందని పేర్కొన్నారు. సాయివర్ధన్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సాయివర్ధన్ తండ్రి తాటి విజయ్‌కుమార్ స్వామి మాట్లాడుతూ తమ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా నిరుపేద కుటుంబాలకు సహాయం చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ తమకు తోచినంత మేర పేదలకు సహాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

సామాజిక సేవలో ముందుంటున్న విజయ్‌కుమార్ స్వామి

మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న తాటి విజయ్‌కుమార్ స్వామి తనవంతుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. యువత, సమాజానికి ఉపయోగపడే



సందేశాలను అందించేలా వివిధ సామాజిక అవగాహన రీల్స్ రూపొందిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు. సామాజిక ప్రయోజనంతో కూడిన ఆయన కార్యక్రమాలకు పలువురి నుంచి అభినందనలు లభిస్తున్నాయి. ఇదే స్ఫూర్తితో తన కుమారుడి పుట్టినరోజును కూడా సేవా కార్యక్రమంగా నిర్వహించడం పలువురి ప్రశంసలు అందుకుంది. కార్యక్రమంలో యువకులు, పోలీసు సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొని సాయివర్ధన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన తాటి విజయ్‌కుమార్ స్వామి–నిహారిక దంపతులను అభినందించారు.

మహనీయులను గౌరవించిన ఘనత బీఆర్ఎస్‌దే : పుట్ట మధూకర్

పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): మహనీయుల స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో వారి చరిత్రను గౌరవించి, స్మరించుకున్న ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మంథని పట్టణంలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ మహనీయుల ఉద్యమ స్ఫూర్తితోనే కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ప్రాధాన్యతను గుర్తించిన కేసీఆర్ హైదరాబాద్‌లో అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న, కొమురం భీం వంటి మహనీయులు భవిష్యత్ తరాల కోసం వందల ఏళ్ల క్రితమే పోరాటాలు చేశారని, వారి పోరాట స్ఫూర్తిని కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ సాధించిన



అనంతరం వారి విగ్రహాలను ఏర్పాటు చేసి గౌరవించుకున్నామని గుర్తుచేశారు. అయితే మంథనిలో మహనీయుల చరిత్రను ప్రజలకు తెలియకుండా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి మున్సిపల్ పాలకవర్గం, అధికార యంత్రాంగం పూలమాలలు వేయకపోవడం బాధాకరమన్నారు. మహనీయుల పట్ల స్థానిక పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో మహనీయుల చరిత్రకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని పుట్ట మధూకర్ ఆరోపించారు. ప్రభుత్వ పరంగా మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ మంథనిలో మాత్రం వారికి కనీస గౌరవం



దక్కకపోవడం ఏమిటని ప్రశ్నించారు. భవిష్యత్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చాకలి ఐలమ్మతో పాటు ఇతర మహనీయులను ఘనంగా గౌరవించుకుంటామని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా వారి చరిత్రను ప్రజలకు చాటి చెబుతామని అన్నారు. మహనీయుల విగ్రహాలు ఎక్కడ ఉన్నా వాటిని గౌరవించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మంథని ఎమ్మెల్యే రాజకీయ ప్రయోజనాల కోసం సమాజాలను ఉపయోగించుకుంటున్నారని, మహనీయులను గౌరవించడం లేదని పుట్ట మధూకర్ ఆరోపించారు. చాకలి ఐలమ్మను గౌరవించకపోవడం పాలకుల ఆలోచనా విధానానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.

ములుగు జిల్లాలో 3,597 మందికి అక్షరాస్యత పరీక్ష

- 171 గ్రామ పంచాయతీలు, 20 పట్టణ వార్డుల్లో పకడ్బందీ ఏర్పాట్లు
- అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా 27న పరీక్ష : కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

ములుగు జిల్లా, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమం ద్వారా ములుగు జిల్లాలో గుర్తించిన 3,597 మంది నిరక్షరాస్యులకు ఆదివారం (సెప్టెంబర్ 27) మూల అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన మదింపు పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు తెలిపారు. జిల్లాలోని 171 గ్రామ పంచాయతీలు, 20 పట్టణ వార్డుల పరిధిలో పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. 15 ఏళ్లకు పైబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో జాతీయ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉల్లాస్ విద్యా కేంద్రాల్లో 100 రోజులపాటు చదవడం, రాయడం, ప్రాథమిక లెక్కలపై శిక్షణ పొందిన అభ్యర్థులు 150 మార్కులకు పరీక్ష రాయనున్నారని కలెక్టర్ వివరించారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి జాతీయ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా అక్షరాస్యత ధ్రువపత్రం అందజేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, ములుగు పట్టణ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు అభ్యర్థుల సౌకర్యాన్ని బట్టి రెండు గంటలపాటు పరీక్ష రాసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. మండలాల వారీగా ఏటూరునాగారంలో 435 మంది, గోవిందరావుపేటలో 223, కన్నాయిగూడెంలో 220, మంగపేటలో 421, ములుగు మండలంలో 115, ములుగు పట్టణంలో 120, తాడ్వాయిలో 23, వెంకటాపూర్‌లో 325, వెంకటాపురంలో 719, వాజేడులో 996 మంది చొప్పున మొత్తం 3,597 మంది



పరీక్షకు హాజరుకానున్నట్లు కలెక్టర్ వివరించారు. అక్షరజ్ఞానం వ్యక్తిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతోపాటు రోజువారీ జీవితంలో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని కలెక్టర్ తెలిపారు. చదవడం, రాయడం, ప్రాథమిక లెక్కలు నేర్చుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాలు, బ్యాంకు లావాదేవీలు, ఆరోగ్య సూచనలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు.అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా పరీక్షకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. కుటుంబ సభ్యులు కూడా అభ్యర్థులను ప్రోత్సహించి పరీక్ష కేంద్రాలకు పంపించాలని కోరారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, కూర్చునే సదుపాయం తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గుర్తించిన అభ్యర్థులందరూ పరీక్షకు హాజరయ్యేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా శాఖల సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు.

రూ.10,016కు గణేష్ లడ్డూ కైవసం

వరంగల్ జిల్లా / పర్వతగిరి, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామంలో శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ లడ్డూ వేలంపాటను ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ వేలంపాట హోరాహోరీగా సాగింది. వేలంపాటలో అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన ముంజంపల్లి సారంగపాణి రూ.10,016కు గణేష్ లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పరకాల వంద పడకల ఆసుపత్రిలో వైద్య సేవలు ప్రారంభం

- నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి



హనుమకొండ, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. పరకాలలో నూతనంగా నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చిన వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం ఆయన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ఓపీ వైద్య సేవలను ప్రారంభించారు. ముందుగా ఆసుపత్రి ప్రాంగణంలో గణపతి పూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని ఓపీ సేవలను ప్రారంభించారు. ఫార్మసీ, సాధారణ వార్డు, స్త్రీ వైద్య విభాగం, గర్భిణుల పరీక్షల విభాగం, ప్రయోగశాల తదితర సేవలను ఎమ్మెల్యే, కలెక్టర్, వైద్యాధికారులు ప్రారంభించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ నూతన ఏరియా ఆసుపత్రి అందుబాటులోకి రావడంతో పరకాల ప్రాంత ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ వైద్యం మరింత చేరువైందన్నారు. ఓపీ సేవలు ప్రారంభం కావడం ద్వారా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రిలో ఇంకా అవసరమైన వైద్య సదుపాయాలపై సమాచారం అందిస్తే వాటిని తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని కోరారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించినప్పుడే ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని అన్నారు. తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఆధునిక వైద్య సదుపాయాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. వైద్యులు, సిబ్బంది సహకారంతో పరకాల ఆసుపత్రిని ఏ ప్లస్ కేటగిరీ స్థాయికి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చిన వివిధ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యులు సమయపాలన పాటిస్తూ నిరుపేద రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ పవన్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ, ప్రజాప్రతినిధులు, వైద్యులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు..

సంతోష్ ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

- ఖమ్మంపల్లికి చెందిన 37 ఏళ్ల వ్యక్తి అదృశ్యం
- ఆచూకీ తెలిసిన వెంటనే సమాచారం ఇవ్వాలని ముత్తారం ఎస్ఐ రవికుమార్ విజ్ఞప్తి



పెద్దపల్లి జిల్లా / ముత్తారం, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన ఇల్లందుల సంతోష్ (37), తండ్రి సత్తయ్య కొంతకాలంగా కనిపించకుండా పోయినట్లు ముత్తారం పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు సంతోష్ మానసిక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆయన ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సంతోష్‌ను ఎవరైనా చూసినా, ఆయన ఎక్కడ ఉన్నారనే సమాచారం తెలిసినా వెంటనే ముత్తారం ఎస్ఐ 8712656531, 9866789884 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. సంతోష్ ఆచూకీ తెలిపిన వారికి తగిన బహుమతి అందజేస్తామని తెలిపారు. సంతోష్ వివరాలను విస్తృతంగా ప్రచారం చేసి, ఆయనను సురక్షితంగా కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ రవికుమార్ విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు నేరుగా మంజూరు చేయాలి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / చర్ల, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): రాజీవ్ యువ వికాసం పథకంతో సంబంధం లేకుండా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత కుటుంబాలకు నేరుగా రుణాలు మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కూరపాటి వీరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా చర్ల మండలంలోని అనేక దళిత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలను రాజీవ్ యువ వికాసం పథకంతో అనుసంధానం చేయడం వల్ల అర్హులకు సాయం అందడంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతాల్లోని నిరుపేదలకు రుణాలు సులభంగా అందేలా నిబంధనలను సరళీకరించాలని కోరారు. దళిత యువత ఇతరుల వద్ద కూలీలుగా పనిచేయకుండా స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేలా పూర్తి సబ్సిడీతో ఆర్టీసీ బస్సులు, కార్లు, బొలెరో, టాటా మ్యాజిక్ వాహనాలతో పాటు జేసీబీలు, ట్రాక్టర్లు మంజూరు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఏటా కేటాయిస్తున్న ఎస్సీ బడ్జెట్ నిధులు మండల స్థాయికి పూర్తి స్థాయిలో ఎందుకు చేరడం లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. చర్ల మండలాన్ని దళితుల ఆర్థికాభివృద్ధికి పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, ప్రతి కుటుంబానికి స్థిరమైన ఉపాధి కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇది రాజకీయ అంశం కాదని, పేదల జీవనోపాధికి సంబంధించిన సమస్య అని పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ అంశంపై తక్షణమే ప్రత్యేక చొరవ తీసుకోవాలని కూరపాటి వీరాజు విజ్ఞప్తి చేశారు.

రామాలయానికి శ్రీమద్భాగవతం గ్రంథాల బహూకరణ



ఏటూరునాగారం, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): ఇస్కాన్ దేవాలయం, వరంగల్ ఆధ్వర్యంలో శ్రీమద్భాగవతం గ్రంథాలను ఏటూరునాగారం శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానానికి బహూకరించారు. మాతాజీ ఇర్సవడ్ల నారాయణమ్మ, శంకరాజుపల్లి సర్పంచ్ దేవులపల్లి విజయ్‌కుమార్, చెన్న కోటమ్మ, శ్రీరామకృష్ణదాస్, మంచోజు రాణి–వెంకటేశ్వర్లు దంపతుల సహకారంతో పద్దెనిమిది పుస్తకాలు, పన్నెండు స్కందాలతో కూడిన శ్రీమద్భాగవతం సంపుటాలను ఆలయ అర్చకులు యల్లప్రగడ నాగేశ్వరరావు శర్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ అలువాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయంలో అర్చకులు ప్రతిరోజూ శ్రీమద్భాగవతాన్ని ప్రవచన రూపంలో భక్తులకు బోధిస్తారని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు రామాలయ ప్రాంగణంలో జరిగే భాగవత ప్రవచనాలకు భక్తులు హాజరై ఆధ్యాత్మిక సందేశాలను వినాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి కత్తెర శ్రీనివాస్‌తో పాటు మహిళా భక్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో వీరవనిత ఐలమ్మకు ఘన నివాళి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ చర్ల, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): చర్ల మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట కాలంలో నిజాం పాలకులు, విస్నూర్ దేశ్‌ముఖ్ వంటి భూస్వామ్య దొరల అణచివేతకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన ధైర్యసాహసోపేత పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. తన భూమి కోసం పోరాడిన ఐలమ్మ భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి ఉద్యమంలో ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్.డి. అజీజ్, ఎడ్ల రామదాసు, కాకి అనిల్, గోరింట్ల వెంకటేశ్వరరావు, తడికల బుల్లబ్బాయి, అంబోజి సతీష్, కుప్పాల నిరంజన్, వేములవాడ కృష్ణ, అంకాల శ్రీను, గంధం రాజుతో పాటు రజక సంఘం నాయకులు రేగళ్ల సుధాకర్, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలే పునాదిరాళ్లు : ఇనగాల వెంకట్రామిరెడ్డి



హన్మకొండ, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. భట్టుపల్లి ప్రాంతంలో 44, 45, 46వ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ స్థాయి ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇనగాల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు, ఆరోపణలకు వాస్తవాలతో సమాధానం ఇవ్వాలని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో, ఐక్యతతో పనిచేయాలని అన్నారు. డివిజన్ల వారీగా పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని సమావేశంలో నాయకులు సూచించారు. కార్యక్రమంలో 44, 45, 46వ డివిజన్ల ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



హనుమకొండ/ కే యూ, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్యార్థులకు లభించే ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని, తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం సూచించారు. పరిశ్రమలు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తమ సామర్థ్యాలను పెంపొందించుకుంటే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు.కేయూ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చిర్రా రాజు అధ్యక్షతన హ్యూమానిటీస్ భవనంలోని సెమినార్ హాల్‌లో నిర్వహించిన జాబ్ డ్రైవ్ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం డొమైన్ పరిజ్ఞానం ఉంటే సరిపోదని, హార్డ్ స్కిల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సమూహ చర్చల్లో మంచి సమాచార మార్పిడి నైపుణ్యాలను ప్రదర్శించేలా విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. ప్రారంభ వేతనం కంటే మంచి అవకాశం, పరిశ్రమలో అనుభవం, భవిష్యత్ అభివృద్ధికి దోహదపడే అవకాశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ విద్యార్థులకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులు ముందస్తుగా సిద్ధం కావాలని సూచించారు. ఒక అవకాశం చేజారినంత మాత్రాన నిరాశ చెందకుండా, లక్ష్యాన్ని చేరుకునే వరకు నిరంతరం ప్రయత్నించాలని అన్నారు. జాబ్ డ్రైవ్‌లో భాగంగా ప్రాథమిక రాత పరీక్షలతో పాటు ఇతర ఎంపిక ప్రక్రియలు కొనసాగుతున్నాయని ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చిర్రా రాజు తెలిపారు. విప్రో, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, టాటా ఎలక్ట్రానిక్స్, బ్రాంజ్ ఐక్యూఐటీ ప్రైవేట్ లిమిటెడ్, మెహతా సర్వీస్ ఇంజనీర్స్, కియా మోటర్స్, ఐటీసీ హైదరాబాద్, బజాజ్ ఎలక్ట్రానిక్స్, జోయాలుకాస్ తదితర సంస్థలు జాబ్ డ్రైవ్‌లో పాల్గొంటున్నాయని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు సాయంత్రం వరకు నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్య ప్రణాళిక అధ్యక్షులు డాక్టర్ చీకటి శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ సంతోష్‌కుమార్, విప్రో సంస్థ మానవ వనరుల విభాగం అధికారిణి లహరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

నల్ల నర్సింహులు శతజయంతి వేడుకలకు బీసీలంతా తరలిరావాలి

- పార్టీలకు అతీతంగా ఐక్యంగా వేడుకలను విజయవంతం చేయాలి
- అక్టోబర్ 2న జనగామలో ఘనంగా శతజయంతి వేడుకలు : కటకం నర్సింహులు



జనగామ జిల్లా/రఘునాథపల్లి, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): సబ్బండ వర్గాల ఆశాజ్యోతి, పద్మశాలి ముద్దుబిడ్డ నల్ల నర్సింహులు శతజయంతి వేడుకలను అక్టోబర్ 2న జనగామ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు మన ఆలోచన–మన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింహులు తెలిపారు. పార్టీలకు అతీతంగా బీసీలంతా ఐక్యంగా తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం రఘునాథపల్లి మండల కేంద్రంలో నల్ల నర్సింహులు శతజయంతి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను కటకం నర్సింహులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలహీన, అట్టడుగు, మైనారిటీ వర్గాల అభివృద్ధి కోసం సమితిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సమాజ అభివృద్ధికి కృషి చేసిన మేధావులను స్మరించుకుంటూ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అక్టోబర్ 2న జనగామ కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా సూర్యాపేట రోడ్డులో ఉన్న నల్ల నర్సింహులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం బతుకమ్మ కుంటలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలోని వివిధ వర్గాలు ఐకమత్యంతో ముందుకు సాగేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు.

ప్రతి గ్రామంలో విగ్రహాలు ఏర్పాటు చేయాలి

నల్ల నర్సింహులు విగ్రహాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయడంతో పాటు హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై కూడా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కటకం నర్సింహులు కోరారు. కార్యక్రమంలో గునిగంటి చంద్రశేఖర్‌గౌడ్, పూస రవి గంగపుత్ర, సింగార రవీందర్, పిట్టల సత్యం, వంగ రవి, రఘునాథపల్లి సర్పంచ్ బొల్లం ఉమారాణి రాజీవ్, సీనియర్ జర్నలిస్ట్ చింతకింది కృష్ణమూర్తి, కరిమికొండ వెంకటేశ్వర్లు, గుండా కృష్ణమూర్తి, చింతకింది భిక్షపతి, గుండ మధుసూదన్, చింతకింది లక్ష్మీనారాయణ, యాదగిరి, కరీంకొండ సిద్ధయ్య, నూనె ముంతల లక్ష్మీనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి పోలీస్ కార్యాలయంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



భూపాలపల్లి, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ నరేష్‌కుమార్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ నరేష్‌కుమార్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలిగా, సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. బానిసత్వం, అణచివేతకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి సమాజంలో చైతన్యాన్ని నింపిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి, ధైర్యం, ఆత్మగౌరవం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను స్మరించుకుంటూ సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, చైతన్యం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ రత్నం, వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్, పోలీస్ సంఘం అధ్యక్షుడు నరేష్, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 12 పశువులు పట్టివేత



ఏటూరునాగారం, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): ఏటూరునాగారం మండలం ముల్లకట్ట వైపు నుంచి వరంగల్ వైపు ఎలాంటి రహదారి పత్రాలు, ఆధారాలు లేకుండా తరలిస్తున్న 12 పశువులను పోలీసులు పట్టుకున్నట్లు ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఏ. చంద్రయ్య తెలిపారు.నమ్మదగిన సమాచారం మేరకు ఏటూరునాగారం అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పశువులను తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, మూడు బొలెరో వాహనాలు, ఒక టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన ఎండీ. యాసీన్, వెంకటాపురం మండల కేంద్రానికి చెందిన పంపాటి కృష్ణ, ఖానాపురానికి చెందిన భూక్య వేముల, తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన రేగుల దామోదర్ పశువులను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారని చంద్రయ్య తెలిపారు. పశువులను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలపై నలుగురితో పాటు వాహనాలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.పట్టుబడిన 12 పశువులను ఏటూరునాగారంలోని గోశాలకు తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రయ్య తెలిపారు.

పెంటన్నగూడెం - బొమ్మరాజు పల్లి పోడు వివాదానికి చరమగీతం పాడేదెప్పుడు?

- నాడు అరకు పట్టిన పాయం
  నేడు పోడు రైతులకు సాయం చేసేనా?





నిత్యం నిఘా, పినపాక, సెప్టెంబర్ 26 :
రాజులు మారిన రాజ్యాలు మారనట్లుగా పెంటన్నగూడెం – బొమ్మరాజు పల్లి గ్రామాల పోడు వివాదాన్ని ఎవరు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవట్లేదు. ఎన్నికలు జరగటం ,ప్రభుత్వాలు మారటం ముఖ్యమంత్రులు పోడు భూములకు పట్టాలిస్తాము అధికారికంగా గుర్తిస్తామని వాగ్దానాలు చేస్తూ వారి అధికార దాహాన్ని తీర్చుకుంటున్నారు తప్ప రెండు గ్రామాల పోడు సమస్యలను గుర్తించట్లేదని పోడు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 20 సంవత్సరాలుగా పెంటన్నగూడెం – బొమ్మరాజు పల్లి గ్రామాల మధ్య పోడు సమస్య అనేక ఉద్రిక్తతల, వివాదాల నడుమ అనేక సంవత్సరాలుగా పోడు రైతుల రక్తంతో నెత్తురోడుతున్న కూడా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం, అధికారులు స్పందించి సమస్యని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

- ఎమ్మెల్యే పాయం నాడు అరకపట్టి దున్నిన భూమి :
25 హెక్టార్ల భూమిని పోడు కొట్టుకున్న రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటానని నేటి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆనాడున సిపిఐ పార్టీలో ఎమ్మెల్యేగా ఉండి రైతుల సమక్షంలో అరక పట్టి పోడు భూమిని దున్నడం జరిగింది. 20 సంవత్సరాలుగా వివాదాల నడుమ కొనసాగుతున్న ఈ పోడు భూమి సమస్య ఎమ్మెల్యే పాయం దృష్టిలో ఎప్పటినుంచో ఉంది. ప్రభుత్వం ద్వారా అధికారుల సహకారంతో రెండు గ్రామాల రైతుల పోడు సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– గిరిజనులకు వ్యతిరేకం కాదు: పెంటన్నగూడెం గ్రామస్తులు.
రెండు గ్రామాల మధ్య నలుగుతున్న ఈ పోడు సమస్యను కులాల మధ్య చిచ్చుగా పరిగణించవద్దని... ఎట్టి పరిస్థితుల్లో గిరిజనులకు మేము వ్యతిరేకం కాదన్న పెంటన్నగూడెం గ్రామస్తుల వాదనను పరిగణలోకి తీసుకొని .. పోడు భూమిని చదును చేసుకున్న రైతుల వివరాలు ఆధారంగా గిరిజన రైతులకు, హరిజన రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇప్పించి తమ జీవనాధారాన్ని దూరం చేయకుండా పోడు రైతుల సమస్యను తీర్చాలని రెండు గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

కార్పొరేషన్ డిపార్ట్ కేసులు... అధికారులకు విన్నపాలు...!
కార్పొరేషన్ డిపార్ట్ కు సంబదించిన దమ్మక్కపేట బీట్ లో ఉన్న 25 హెక్టార్ల భూమిని పెంటన్నగూడెం –బొమ్మరాజు పల్లి గ్రామాల రైతులు పోడు భూమి నరికి,నాగల్లు దున్నడం, పోడు భూమిలో గుడిసెలు వేయటం అటవీ శాఖ అధికారులు కూలగొట్టడం జరిగింది. వ్యవసాయం చేసే పోడు రైతులకు అధికారుల తీరు సమస్యగా మారింది. ఎంతో కష్టపడి సాగు చేసుకుంటున్నా... పోడు భూమిపై కార్పొరేషన్ అధికారులు పలుమార్లు రైతులపై దాడి చేసి కేసులు పెట్టడం జరిగింది. పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగటం ఆ రెండు గ్రామ ప్రజలకు అలవాటుగా మారింది.పోడు సమస్య పరిష్కారం దిశగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అధికారుల సహకారంతో పట్టాలి ఇప్పించాలని ముక్తకంఠంతో రెండు గ్రామ ప్రజల పోడు రైతులు వేడుకుంటున్నారు.

వరంగల్‌ను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- గ్రామస్థాయి నుంచే ప్రతిభను గుర్తించి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలి
- క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం : ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



హనుమకొండ, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించి, గ్రామస్థాయి నుంచే అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలతో పాటు జూనియర్ బాలురు, బాలికలు, పురుషులు, మహిళల విభాగాల్లో నిర్వహించిన పోటీలు, భారత్ యువజన అండర్–18 ఎంపిక శిబిరానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, నగర పోలీస్ కమిషనర్ శ్వేత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరింత మంది క్రీడాకారులను తీర్చిదిద్దేలా క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై ప్రజాప్రతినిధులంతా కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.స్టేడియం అభివృద్ధిని కేవలం ఒక క్రీడా మైదానానికే పరిమితం చేయకుండా, అన్ని రకాల క్రీడా సౌకర్యాలు అందుబాటులో ఉండేలా సమగ్ర క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, వసతులు కల్పించడంతో పాటు గ్రామస్థాయి నుంచే ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.క్రీడల ద్వారా యువతలో ఆరోగ్యకరమైన జీవన విధానంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని ఎమ్మెల్యే అన్నారు. క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు కొద్దిమందికే పరిమితం కాకుండా, ఎక్కువ మంది ప్రతిభావంతులు ఉన్నత స్థాయికి ఎదిగేలా కింది స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించాలన్న నగర పోలీస్ కమిషనర్ శ్వేత సూచన అభినందనీయమన్నారు.విద్య, వైద్యం తర్వాత క్రీడలకు కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. అందుబాటులోకి వస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుని వరంగల్‌ను క్రీడా రంగంలో ముందంజలో నిలపాలని ఆకాంక్షించారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాలు సమన్వయంతో పనిచేస్తాయని తెలిపారు. క్రీడా రంగంలో ప్రతిభ కనబరుస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని, యువత క్రీడలను తమ భవిష్యత్తుకు బలమైన పునాదిగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

- భూమి, భుక్తి కోసం.. వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆమె పోరాటం చిరస్మరణీయంమహిళా లోకం ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలి : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల తెగువకు, పాలకుర్తి గడ్డ పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఆమె చిత్రపటానికి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తన పోరాటంతో తెలంగాణ ప్రజల స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. మహిళా లోకానికి ఆమె పోరాట జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. మహిళలు చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆకాంక్షించారు. ఆమె పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- **మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్**



కరీంనగర్ జిల్లా/జమ్మికుంట, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి): వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను జమ్మికుంట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచారని అన్నారు. తెలంగాణ ప్రజల తెగువ, పోరాట పటిమను ప్రపంచానికి చాటిన నిప్పుకణిక ఐలమ్మ అని కొనియాడారు. సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.చాకలి ఐలమ్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం పట్ల తన తరఫున, రజక సంఘం కుటుంబ సభ్యుల తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఐలమ్మ చూపిన ధైర్యం, స్ఫూర్తి, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆర్ఐ భాస్కర్, ఏఈ వికాస్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, రజక సంఘం అధ్యక్షులు వరంగంటి సదానందం, బూరుగుపల్లి రాము, గంగారపు శ్రీకాంత్, రజక సంఘం నాయకులు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పూరిగుడిసెలు లేని తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇల్లు: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

జనగామలో 500 పూరిగుడిసెల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం



నిత్యం నిఘా ప్రతినిధి, జనగామ, సెప్టెంబర్ 26 :
రాష్ట్రంలో పూరిగుడిసెలు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పేదల గుమ్మానికి సంక్షేమ పథకాలను చేర్చుతున్నామని చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త తెల్ల రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు సంక్షేమ హాస్టళ్లలో డైట్ ఛార్జీలను 40 శాతం పెంచడంతో పాటు కాస్మోటిక్ ఛార్జీలను కూడా పెంచామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో అంతర్జాతీయ స్థాయి సమీకృత విద్యాసంస్థలను నిర్మిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. వచ్చే దసరా నాటికి 2.18 లక్షల ఇళ్లను పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గానికి సమానంగా 3,500 ఇళ్లను మంజూరు చేశామని, జనగామ నియోజకవర్గానికి కూడా అదే సంఖ్యలో ఇళ్లు కేటాయించామని చెప్పారు. నిర్మాణ పనులు పూర్తయిన దశలను బట్టి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నామని తెలిపారు. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి, ప్రతి నియోజకవర్గానికి అదనంగా 2,000 ఇళ్లు కేటాయించామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో పూరిగుడిసెలు లేకుండా చేయాలనే లక్ష్యంతో ముందుగా పూరిళ్లలో నివసిస్తున్న కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. జనగామ నియోజకవర్గంలో గుర్తించిన 500 పూరిగుడిసెల కుటుంబాలకు ఈ వేదిక నుంచే ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు.అసంపూర్తిగా నిలిచిపోయిన ఇందిరమ్మ ఇళ్లు, మొండిగోడలతో ఉన్న ఇళ్లు, స్లాబ్ స్థాయిలో ఆగిపోయిన ఇళ్లను కూల్చివేయకుండా పూర్తి చేసుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని రెండో విడతలో అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.గతంలో సేకరించిన ప్రభుత్వ ఇళ్ల స్థలాలను గుర్తించి అర్హులైన పేదలకు పంపిణీ చేసి, తదుపరి విడతల్లో అక్కడ ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఇప్పటివరకు రూ.70 వేల కోట్లకు పైగా సున్నా వడ్డీ రుణాలు అందించినట్లు చెప్పారు. గతంలో నిర్మాణం పూర్తికాని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నివాసయోగ్యంగా మార్చి అర్హులైన లబ్ధిదారులకు అందించడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. జనగామలో ఇందుకోసం అవసరమైన రూ.2 కోట్లను వెంటనే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. దసరా నాటికి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. జనగామ మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధికి తొలి విడతగా రూ.25 కోట్లు వెంటనే మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. ఇప్పటికే శంకుస్థాపన చేసిన రూ.58–60 కోట్ల అభివృద్ధి పనులతో పాటు టెండర్లు పూర్తయిన రూ.19 కోట్ల పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రైతు భరోసా కొనసాగుతోందని, వరి సాగు చేసిన రైతులకు మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్ అందిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ఇప్పటికే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయగా, మరో 14–15 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసినట్లు చెప్పారు.

అర్హులైన వారికే ఇళ్లు

భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుందని, ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో అర్హులైన పేదలకే ఇళ్లు అందేలా చూడాలని, అర్హత లేని వారు ఉంటే తొలగించి నిజమైన అర్హులకు అవకాశం కల్పించాలని సూచించారు.

జనగామ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో జనగామ మున్సిపాలిటీ అత్యంత పురాతన మున్సిపాలిటీల్లో ఒకటని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతులను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఏడు నెలల క్రితం మంజూరై టెండర్లు పూర్తయిన రూ.18.90 కోట్ల అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. వడ్లకొండ–శామీర్‌పేట్ బైపాస్ రోడ్డును డబుల్ లైన్ చేయడంతో పాటు చీటకోడూరు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, గండిరామారం పంపులను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రెండో దశలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన నిరుపేదలకు మంజూరు చేయాలని కోరారు. జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి మాట్లాడుతూ చీటకోడూరు డ్యామ్ పరిసర ప్రాంతాల్లో 2008 నుంచి కొనసాగుతున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. ఆయా ప్రాంతాలకు మంచినీటి సరఫరాను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పలు వార్డుల్లో పనులు చేపడుతున్నామని తెలిపారు.జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నిరుపేదల సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. అనంతరం 500 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, జనగామ మున్సిపల్ వైస్ చైర్మన్ బూషి పర్వతాలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, డీసీసీ అధ్యక్షురాలు ఎల్. ధన్వంతి నాయక్, వైటీడీఏ సభ్యులు ఎల్. లక్ష్మీనారాయణ నాయక్, ఆర్డీఓ గోపీరాం, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- **పార్టీలకు అతీతంగా వేడుకలను విజయవంతం చేయాలి**
- **మన ఆలోచన–మన సాధన సమితి అధ్యక్షుడు కటకం నర్సింహులు పిలుపు**



రఘునాథపల్లి, సెప్టెంబర్ 26 (నిత్యం నిఘా ప్రతినిధి):
సబ్బండ వర్గాల ఆశాజ్యోతి, పద్మశాలి ముద్దుబిడ్డ నల్ల నర్సింహులు శతజయంతి వేడుకలను పార్టీలకు అతీతంగా బీసీలంతా ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని మన ఆలోచన–మన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింహులు పిలుపునిచ్చారు.అక్టోబర్ 2న జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న శతజయంతి వేడుకల కరపత్రాలను శనివారం రఘునాథపల్లి మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కటకం నర్సింహులు మాట్లాడుతూ బలహీన, అట్టడుగు, మైనార్టీ వర్గాల అభివృద్ధి కోసం మన ఆలోచన–మన సాధన సమితిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సమాజ అభివృద్ధికి కృషి చేసిన మేధావులను స్మరించుకుంటూ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.అక్టోబర్ 2న జనగామ కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా సూర్యాపేట రోడ్డులో ఉన్న నల్ల నర్సింహులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం బతుకమ్మ కుంటలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలోని వివిధ బీసీ, బలహీన వర్గాలు ఐకమత్యంతో ముందుకు సాగేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

గ్రామగ్రామాన నల్ల నర్సింహులు విగ్రహాలు ఏర్పాటు చేయాలి

నల్ల నర్సింహులు సేవలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి గ్రామంలో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేయాలని కటకం నర్సింహులు కోరారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై కూడా నల్ల నర్సింహులు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో గునిగంటి చంద్రశేఖర్ గౌడ్, పూస రవి గంగపుత్ర, సింగార రవీందర్, పిట్టల సత్యం, వంగ రవి, రఘునాథపల్లి సర్పంచ్ బొల్లం ఉమారాణి రాజీవ్, సీనియర్ జర్నలిస్ట్ చింతకింది కృష్ణమూర్తి, కరిమికొండ వెంకటేశ్వర్లు, గుండా కృష్ణమూర్తి, చింతకింది భిక్షపతి, గుండ మధుసూదన్, చింతకింది లక్ష్మీనారాయణ, యాదగిరి, కరీంకొండ సిద్దయ్య, నూనె ముంతల లక్ష్మీనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు కృషి చేయాలి

- **ఘనంగా జయంతి ఉత్సవాలు**



నిత్యం నిఘా, నిజామాబాద్ , సెప్టెంబర్ 26 : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు,వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు అంకిత భావంతో కృషి చేయాలని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్,అదనపు కలెక్టర్ భుజంగరావు పిలుపునిచ్చారు.చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్సీ,అదనపు కలెక్టర్,ఇతర జిల్లా శాఖల అధికారులు,వివిధ కుల సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ జయంతి సభ జరిపారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ....చాకలి ఐలమ్మ పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేశారని గుర్తు చేశారు.హక్కుల కోసం రాజీలేని పోరాటం చేసి స్ఫూర్తిని నింపారని కొనియాడారు.చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని,ఆమె ఆశయాల సాధనకు కృషిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు,జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారులు,వివిధ కుల సంఘాల ప్రతినిధులు,రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బర్త్‌నగర్‌లో సీసీ రోడ్ల పనులపై పరిశీలన

● ఎమ్మెల్యే మార్రి రాజశేఖర్‌రెడ్డి సూచనల మేరకు అధికారుల పర్యటన



నిత్యం నిఘా, నేరేడ్ మెట్, సెప్టెంబర్ 26 : మల్కాజిగిరి ఎమ్మెల్యే మార్రి రాజశేఖర్‌రెడ్డి సూచనల మేరకు మున్సిపల్ అధికారులు బర్త్‌నగర్, కౌకూర్ ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ ఆయా ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులపై వివరాలు సేకరించారు.బతుల రాజు యాదవ్ ఇంటి లేన్ నుంచి చర్చి లేన్ ప్రధాన రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పనులను పరిశీలించి, ఆమోదానికి అవసరమైన చర్యలను చేపట్టారు. రహదారి నిర్మాణంతో స్థానికులకు రాకపోకల సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు.అలాగే కాట మైసమ్మ ప్రధాన రహదారి వద్ద నీరు నిలిచిన ప్రాంతాన్ని రెండు హైడ్రా బృందాలు పరిశీలించి, నిల్వ ఉన్న నీటిని తొలగించే పనులు చేపట్టాయి. దీంతో స్థానికులకు ఇబ్బందులు తొలగించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.కార్యక్రమంలో కాలనీ వాసులు సరస్వతి, శోభ, సురేందర్‌తో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి. లక్ష్మణ్ యాదవ్, వెంకటేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, వెన్న సతీష్, రమేష్ చారి, సందీప్, నరేష్, హనుమాన్ చారి, సత్యనారాయణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గా మైసమ్మ ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం

● భక్తిశ్రద్ధలతో పూజలు.. అనంతరం అన్నదానం



నిత్యం నిఘా, మల్కాజిగిరి, సెప్టెంబర్ 26 : విజయదుర్గా మైసమ్మ ఆలయంలో జైశ్రీరామ్ యువజన సంఘం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రత పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. పలువురు భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సత్యనారాయణ వ్రతంలో శ్రీనివాస్ యాదవ్, మోహన్ యాదవ్, భాస్కర్ యాదవ్, సతీష్‌రావు, రవి యాదవ్, రమేష్ యాదవ్, తడక జగదీశ్వర్, గుప్తా తదితరులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులు, నిర్వాహకులకు జైశ్రీరామ్ యువజన సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ



నిత్యం నిఘా, నిజామాబాద్, సెప్టెంబర్ 26 : నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు శనివారం నిజామాబాద్ కమిషనరేటు కార్యాలయంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు అదనపు డి.సి.పి (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్ ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ముందుగా చాకలి ఐలమ్మ ఫోటోకు పూలమాలలు వేసిన అనంతరం,అదనపు డి.సి.పి మాట్లాడుతూ....తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు,ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయని,భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన తెగువ,పౌరుషం తెలంగాణ ఆస్తిత్వాన్ని,ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎ.సి.పి(ఎ.ఆర్)కృష్ణ, పరిపాలన అధికారి ఆసియా బేగం,ఆఫీస్ సూపరింటెండెంటులు శంకర్,వనమాల,జగతి,రిజర్వ్ ఇన్స్పెక్టర్స్,పోలీస్ కార్యాలయం సిబ్బంది,సి.సి.ఆర్.బి సిబ్బంది,సి.ఎస్.బి సిబ్బంది,ఐ.టి కోర్ సిబ్బంది,పోలీస్ కంట్రోల్ రూం సిబ్బంది,సెంట్రల్ కాంప్లెంటు సెల్ సిబ్బంది హాజరుకావడం జరిగింది.

గోదావరి పుష్కర పనులకు అత్యంత ప్రాధాన్యత

- కలెక్టర్ భవేష్ మిశ్రా





నిత్యం నిఘా, నిజామాబాద్, సెప్టెంబర్ 26 : గోదావరి పుష్కర పనులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని,ఇప్పటికే కందకుర్తి,యంచ వద్ద భక్తుల సౌకర్యార్థం పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా సదుపాయాల కల్పన కోసం పనులను ప్రారంభించడం జరిగిందని కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు.గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి హైదరాబాద్ నుండి శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్,కమిషనర్ హనుమంత రావులు ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు.గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిన దృష్ట్యా,పుష్కర ఘాట్ల వద్ద విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.పుష్కరాలకు గడువు సమీపిస్తున్నందున పనులను తక్షణమే చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ....నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తి పుష్కర క్షేత్రంతో పాటు బాసరకు ఆనుకుని అత్యంత చేరువలో ఉన్న యంచ వద్ద ఎండోమెంట్,ఇరిగేషన్,పంచాయతీరాజ్,ఆర్ అండ్ బీ తదితర శాఖల ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు వీలుగా శంకుస్థాపనలు పూర్తయ్యాయని తెలిపారు.కందకుర్తి వద్ద గోదావరిలో నీటి ప్రవాహం ఉన్నందున కొత్త పుష్కరఘాట్ నిర్మాణానికి మరికొంత సమయం పడుతుందని అన్నారు.ఎస్సారెస్పీ లో ప్రస్తుతం 46 టీ.ఎం.సీల వరకు నీరు నిలువ ఉందని,20 నుండి 25 టీ.ఎం.సీలకు నీటి మట్టం చేరిన మీదట పుష్కర ఘాట్ పనులు చేపట్టేందుకు వీలుంటుందని తెలిపారు.మిగితా పనులను వెంటదివెంట చేపట్టి,మైల్ స్టోన్ ప్రకారం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని,మార్చి నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తయ్యేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తున్నామని అన్నారు.కందకుర్తి,యంచతో పాటు జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన తుంగిని,పోచంపాడ్,తడ్ పాకల్ తదితర పుష్కర ప్రదేశాల వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు వీ.ఐ.పీలు,వీ.వీ.ఐ.పీలు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున వాహనాల పార్కింగ్,సరైన రోడ్డు వసతి,అత్యవసర ఎగ్జిట్ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.పుష్కర ఘాట్ల వరకు అప్రోచ్ రోడ్లు,ఘాట్ల మరమ్మతులు వంటి పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టేలా అధికారులకు దిశానిర్దేశం చేశామన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ,డీ.ఆర్.ఓ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,జెడ్పీ సీఈఓ సాయాగౌడ్,డీఆర్డీఓ సాయన్న,పంచాయతీరాజ్,ఆర్ అండ్ బీ,ఇరిగేషన్,ఎండోమెంట్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవో సంఘంపై అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నాం

● వాస్తవాలు తెలుసుకోకుండా ఉద్యోగుల సంఘ ప్రతిష్ఠను దెబ్బతీసేలా కథనాలు రాయడం సరికాదు: జిల్లా అధ్యక్షుడు బి. రవి ప్రకాష్



నిత్యం నిఘా, మేడ్చెల్ , సెప్టెంబర్ 26 : తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్‌జీవో) మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శాఖపై ఓ దినపత్రికలో ప్రచురితమైన కథనం వాస్తవాలకు విరుద్ధంగా ఉందని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు బి. రవి ప్రకాష్ తెలిపారు. వాస్తవాలను పూర్తిగా తెలుసుకోకుండా ఒక ఉద్యోగికి సంబంధించిన అంశాన్ని మొత్తం ఉద్యోగుల సంఘానికి ఆపాదిస్తూ వార్తలు ప్రచురించడం బాధ్యతాయుతమైన జర్నలిజం కాదని పేర్కొన్నారు.సంబంధిత అంశంపై పూర్తి వివరాలను తెలుసుకుని, సంఘం ప్రతినిధుల వివరణ తీసుకున్న అనంతరం వార్త ప్రచురించి ఉంటే వాస్తవ పరిస్థితి స్పష్టంగా తెలిసేదని అన్నారు. వైద్య ఆరోగ్యశాఖలోని కొందరు అధికారుల వ్యవహారశైలి కారణంగానే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ఆయన ఆరోపించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు వారిని భయపెట్టే లేదా ఒత్తిడికి గురిచేసే ధోరణికి స్వస్తి పలికి, నిబంధనల ప్రకారం పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.టీఎన్‌జీవో సంఘం అధికారులను బెదిరించడం, ఒత్తిడి చేయడం లేదా వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం వంటి విధానాలను ఎప్పుడూ అనుసరించదని రవి ప్రకాష్ స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలపై సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించి, చర్చల ద్వారా పరిష్కారం సాధించడమే సంఘం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య విధానమని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో టీఎన్‌జీవో సంఘానికి ప్రత్యేక పాత్ర ఉందని ఆయన గుర్తుచేశారు. 1969 జై తెలంగాణ ఉద్యమం నుంచి ఉద్యోగుల హక్కులు, స్థానికుల హక్కులు, నిబంధనల అమలు కోసం సంఘం నిరంతరం తన గళాన్ని వినిపించిందన్నారు. జీఓ 610 అమలు విషయంలోనూ ఉద్యోగుల హక్కుల కోసం సంఘం పోరాడిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో 2011 సకల జనుల సమ్మె సందర్భంగా ఉద్యోగ సంఘాలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.దశాబ్దాలుగా లక్షలాది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తూ వారి సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న సంఘం ప్రతిష్ఠను దెబ్బతీసేలా వాస్తవ నిర్ధారణ లేకుండా కథనాలు ప్రచురించడం బాధాకరమని రవి ప్రకాష్ అన్నారు. “టీఎన్‌జీవో సంఘం ఎవరికీ వ్యతిరేకం కాదు. అయితే ఉద్యోగులకు అన్యాయం జరిగితే ప్రశ్నించకుండా ఉండదు. ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చట్టబద్ధమైన, ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిష్కరించుకోవడమే మా విధానం” అని స్పష్టం చేశారు.ఒక సంఘంపై కథనం ప్రచురించే ముందు సంబంధిత అంశానికి సంబంధించిన వాస్తవాలు, సంఘం ప్రతినిధుల వివరణ తెలుసుకోవాలని మీడియా సంస్థలకు ఆయన సూచించారు. ప్రచురితమైన కథనంపై పునఃపరిశీలన చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని రవి ప్రకాష్ డిమాండ్ చేశారు.

ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



నిత్యం నిఘా, వికారాబాద్ , సెప్టెంబర్ 26 వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిచెప్పిన వీరవనిత చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేష్ పిలుపునిచ్చారు.చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా శనివారం కుల్కచర్లలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళా లోకానికి ఐలమ్మ పోరాట స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల సభ్యులు, రజక సంఘం ప్రతినిధులు నాయకులు, యువజన సంఘాల పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com